ప్రజా సంక్షేమానికి పెద్దపీట



చిక్కడపల్లి: ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి అన్నారు. ఇటీవల ఢిల్లీలో ఏఐసీసీ ఇందిరాభవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను గురువారం జ్ఞానేశ్వరి కలసి సన్మానించారు. అనంతరం ఆమె గాంధీనగర్‌లో మాట్లాడుతూ.... దేశంలో సభ్యత్వంలో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రానికి అవార్డు లభించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



రహమత్‌బాగ్‌లో మ్యాన్‌హోల్‌కు మర్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: రహమత్‌బాగ్‌లో కొంత కాలంగా మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. స్థానికులు ఈ సమస్యను కార్పొరేటర్ ఉమా రాణి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె గురువారం జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, కృష్ణ, సూరిబాబు, రామకృష్ణ, ఓంప్రకాష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించుకోవాలి



కళాకారులతో ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం

చిక్కడపల్లి: అంతరించిపోతున్న కళలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. గురువారం రాత్రి ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని త్యాగరాయ గానసభలో నిర్వహించారు. 'పదవీ విరమణ తర్వాత తిరిగి..'నాటకాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇటిక్యాల పురుషోత్తం కళాకారులను సన్మానించి మాట్లాడారు. ప్రదీప్ కుమార్‌కు రంగస్థలంపై ఉన్న మక్కువ ఎక్కువన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కోట్ల హనుమంతరావు, డాక్టర్ చంద్రశేఖర్, నాటగురువు వెంకటాచారి, నటుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులు

చిక్కడపల్లి: హైదరాబాద్ నగరంలో క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టు రట్టయ్యింది. ముగ్గురిని అరెస్ట్ చేసి నగదు, మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులు మొహమద్ ఫిరాసత్ అలి, నితిన్‌కుమార్, వికాస్ అగర్వాల్‌లను అరెస్టు చేశారు. రాజస్థాన్ జైపూర్‌కు చెందిన ప్రధాన బుకీ పవన్ నుంచి వారు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యూజర్ లాగిన్ ఐడీలు పొందారు. ఈ ముగ్గురు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను నిర్వహిస్తూ పంటర్లకు యూజర్ ఐడీలు, పాస్వర్డులు అందించి బెట్టింగ్ సదుపాయాలు కల్పించేవారు. హైదరాబాద్‌లోని కమిషనర్ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చిక్కడపల్లి పోలీసులు వారిని గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,48,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దుమ్ము లేవొద్దని నీళ్లు చల్లి..!

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని దాయార మార్కెట్ నుంచి సాగర్‌లాల్ ఆస్పత్రి నుంచి రాజా డీలక్స్ చౌరస్తా వరకు ఇటీవల మంచి నీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. అప్పటి నుంచి ఈ దారిలో దుమ్ము, ధూళి లేవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు పర్వేజ్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు చేపట్టేంతవరకు రోడ్డుపై దుమ్ము లేవకుండా వాటర్ ట్యాంక్ ద్వారా జలమండలి నీళ్లను చల్లింది.



రోడ్డుపై నీరు పోస్తున్న సిబ్బంది

రోడ్డు ఛిద్రం.. జర భద్రం.!

కంకర తేలి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టని వైనం



కంకరతేలి గుంతలమయంగా మారిన నల్లకుంట రైల్వే ట్రాక్ రోడ్డు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలో పలు ప్రాంతాలలో అంతర్గత వీధులు ఛిద్రమై పాదచారులు, వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. రెండేళ్లుగా కంకర తేలిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివిజన్ పరిధిలోని చాలా బస్తీలలో ఛిద్రమై కంకర తేలిన బీటీ రోడ్లు, గుంతలమయంగా మారిన సీసీ రోడ్లే కనిపిస్తున్నాయి.

అర కిలోమీటరు మేరు కంకర తేలి...

◆ ప్రధానంగా న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ వీధి, నల్లకుంట మోరం క్వారీ లేన్, నల్లకుంట రైల్వే ట్రాక్ (మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఇంటి వద్ద నుంచి) నుంచి తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు దాదాపు అర కిలోమీటరు పొడవునా బీటీ రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

మొరపెట్టుకున్నా స్పందించని వైనం..

◆ ఛిద్రమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్‌కు పలు మార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇదిలా ఉంటే కొన్ని ప్రాంతాల్లో బాగున్న రోడ్లను సైతం తవ్వి కొత్త రోడ్లు నిర్మిస్తున్న అధికారులు తమ వీధిని ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధి స్పందించి ఒకసారి తమ ప్రాంతంలో పర్యటించి రోడ్డు దుస్థితి ఎలా ఉందో ప్రత్యక్షంగా చూసైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల్లో వాగ్దానాలు, గెలిచాక ముఖం చాటేసిన ప్రజా ప్రతినిధి..!

ఎన్నికలకు ముందు ఇంటింటికి తిరిగిన నాయకులు తమకు ఓటేసి గెలిపిస్తే బస్తీలు, కాలనీలలోని సమస్యలన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామంటూ వాగ్దానాలు చేసి ప్రజా ప్రతినిధులుగా గెలిచిన తర్వాత సమస్యలు పట్టించుకోకుండా ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధోబీఘాట్ బస్తీలో నల్లా కనెక్షన్ల పునరుద్ధరణ



కార్పొరేటర్ పావనిని శాలువాతో సన్మానిస్తున్న ధోబిఘాట్ బస్తీవాసులు

చిక్కడపల్లి: ధోబీఘాట్ బస్తీలో 15ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మంచి నల్లా కనెక్షన్‌ను వాటర్ వార్క్స్ అధికారులతో మాట్లాడి గాంకార్పొరేటర్ పావని పునరుద్ధరించారు. దీంతో ధోబీఘాట్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ధోబీఘాట్ బస్తీని కార్పొరేటర్ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని బస్తీవాసులకు సరిపడా నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనిని బస్తీవాసులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, సాయికుమార్, ఆనంద్‌రావు, బస్తీవాసులు మల్లికార్జున్, రమేష్, నాగరాజు, పూజిత, శోభ, సురేష్, వరమ్మ, సంజీవ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలి



డీఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్ ఆరోపించారు. భూకబ్జాదారుల నుంచి ఈ స్థలాన్ని కాపాడాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రామానుజరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో 200 గజాల స్థలం తమదే అంటూ నకిలీ దస్తావేజులు సృష్టించి రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నారని ఆరోపించారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నారని తెలిపారు. భూకబ్జా విషయంపై విద్యుత్ శాఖ ఏఈ, సికింద్రాబాద్ ఆర్డీవో దృష్టికి సైతం తీసుకెళ్లామని పేర్కొన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఈ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలమని బోర్డు సైతం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

యువతిపై అత్యాచారానికి యత్నించిన దుండగుడిని శిక్షించాలి

రైళ్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఐద్వా



బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న మహిళపై లైంగిక దాడికి ప్రయత్నించిన దుండగుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, సహాయ కార్యదర్శి కేఎన్ ఆశాలత డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా తెల్లాపూర్ ఎంఎం టీఎస్ రైలు ఒంటరిగా ప్రయాణిస్తున్న యువతిపై అత్యాచారానికి యత్నించగా కొంపల్లి ప్రాంతంలో రైలు నుంచి దూకిందన్నారు. దీంతో ముఖానికి గాయాలు కాగా, కుడి చేయి, పక్కటెముక విరిగిందన్నారు. కూలీనాలీ చేసుకునే కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. యువతికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు ఎంఎంటీఎస్ రైలులో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైలులో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మహిళలను వేధిస్తున్నప్పుడు రైలు ఆగిపోవడానికి ఒక బటన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

గుండగోని మైసయ్య సేవలు చిరస్మరణీయం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉమ్మడి రాష్ట్ర బీజేపీ కార్యదర్శిగా పనిచేసి ఎంతో మంది పేదలను ఆదుకున్న గుండగోని మైసయ్య సేవలు చిరస్మరణీయమని బీజేవైఎం రాష్ట్ర నేత కోవా రాహుల్, రాంనగర్ కార్పొరేటర్లు కె. రవిచారి, పావని, సుప్రియ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో గుండగోని మైసయ్య 26వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం సీనియర్ నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, రఘువీర్, కె.ఉపేందర్, భరత్‌భూషణ్, నితిన్‌గౌడ్, వీరయ్య, జక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి
ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



గాంధీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడతున్న సెక్రటరీ జనరల్ ప్రఫూల్ రాంరెడ్డి

ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫూల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గాంధీనగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 200 గజాల స్థలం, పింఛన్‌లు ఇస్తామన్న హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు రూ.20లక్షల హెల్త్ కార్డు, ఈఎస్‌ఐ సౌకర్యం, బస్సులో ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి, తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, జేఏసీ కోశాధికారి చంద్రన్న, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షులు సుజాత, స్వరూపారాణి, తెలంగాణ ఉద్యమకారుల అధ్యక్షుడు వేముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ముషీరాబాద్: ప్రైవేటు వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో పేదలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని బీఆర్‌ఎస్ యువ నేత ముఠా జైసింహ కోరారు. సిద్ధిఖ్‌నగర్‌లో ఎన్‌డీఎస్‌జీవో సంస్థ, రేయిన్‌బో కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సింధూ, పాల్, ఎన్‌ఆర్‌డీఎస్‌జీవో సంస్థ ప్రతినిధులు ఇందిరాభారతి, వెంకటేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ ఆలీ, పర్వేజ్ కురేషీ, ఆజీపాషా, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'హర్ ఆర్ట్ గ్యాలరీ' చిత్ర ప్రదర్శన

చిక్కడపల్లి: హస్తకళా స్రష్ట పాశం కమలాప్రసాద్ సృష్టించిన హస్తకళా వైభవంపై నిర్మించిన 'హర్ ఆర్ట్ గ్యాలరీ'డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్నట్లు సంస్కృతి రత్న కె.ధర్మారావు, థియేటర్ ప్రతినిధి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న శుక్రవారం సాయంత్రం 6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీ ఆ చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ మహేందర్‌కుమార్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి ఆలయ హుండీలో భక్తులు వేసిన కానుకలను గురువారం లెక్కించారు. కానుకలను లెక్కింపును ఆలయ కమిటీ ఈఓ మహేందర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అండాలు పర్యవేక్షణలో నిర్వహించారు. మూడు నెలల్లో భక్తులు వేసిన కానుకలు రూ.41,321 వచ్చాయని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ప్రధాన అర్చకులు చంద్రమౌళి, రాము తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వాటర్ వర్క్స్ ఉద్యోగులు

భూగర్భ జలాలను సంరక్షించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ జీఎం రామకృష్ణ అన్నారు. గురువారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నారాయణగూడ డివిజన్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా బాగ్‌లింగంపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కళాశాలతో పాటు పలు ప్రాంతాలలో భూగర్భ జలాల పెంపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మోహన్‌రాజ్, వాటర్‌వర్క్స్ మేనేజర్ ఎం.జీవన్ జ్యోతి, వివిధ సంస్థల ప్రతినిధులు ఎస్.కుమారస్వామి, బి.శ్రీధర్, ఎన్.స్వప్న, శ్రావణ్, కృష్ణ కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక నివేదికలలో మార్పులపై సదస్సు



సదస్సులో పాల్గొన్న వక్తలు గణేష్, కేవీ ప్రదీప్, హితేష్ జైన్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తాజ్ మహల్ హోటల్‌లో ట్యాక్స్‌బార్ నాన్ కార్పొరేట్ ఎంటిటీల కోసం ఆర్థిక నివేదికలపై వచ్చే మార్పులపై సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... 1 ఏప్రిల్ 2025 నుంచి అమలులోకి రానున్న ఈ మార్పులు, నాన్-కార్పొరేట్ ఎంటిటీలకు వారి ఆర్థిక డేటాను ఎలా నిర్వహించాలో, ఎలా సమర్పించాలో గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఏ హితేష్ జైన్, కార్యదర్శి సీఏ చంద్రశేఖర్ వేముల, సీఏ జి.గణేష్, కేవీ ప్రదీప్, రామ్‌దేవ్ బుటాడ, అమ్రిత్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్స్, ట్యాక్స్ అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నాం



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.మట్టా శేఖర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. అందులో భాగంగా కళా రంగంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చరల్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రొడక్షన్ ఓరియెంటెడ్ థియేటర్ యాక్టింగ్ శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో 20మంది విద్యార్థులు శిక్షణ పొందనున్నారు. ఈ శిక్షణ శిబిరానికి కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ డా. మట్టా శేఖర్, కోకన్వీనర్‌గా సుంకరి నవీన్, మాస్టర్ ట్రైనర్‌గా కిరణ్ వ్యవహరిస్తారు.

రిజర్వేషన్లు రావడానికి కారకులు సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్



సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌పీజేఎఫ్ చైర్మన్ వీజీఆర్ నారగోని

కాచిగూడ: మహాజ్ఞాని సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ 128వ వర్ధంతి సందర్భంగా మాదరబోయిన నర్సయ్య అధ్యక్షతన గురువారం బీసీ కార్యాలయంలో ఆయన వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ విజీఆర్ నారగోని ముఖ్యఅతిథిగా పాల్గొని సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ చిత్రపటానికి నివాళులర్పించారు. భారతదేశంలో రిజర్వేషన్లు రావడానికి కారకులు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ అని గుర్తుచేశారు. 1909లో బ్రిటిష్ పాలనలో 9వ ప్రెసిడెన్సీలలో ముస్లిం సమాజానికి రాజకీయ రిజర్వేషన్లు లభించాయని అన్నారు. ఆ తరువాత నాన్ బ్రహ్మణులకు, సిక్కులు, అంటరాని కులాలు, మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించబడ్డాయని నారగోని తెలిపారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అన్ని కులాలు, వర్గాలకు రాజ్యాధికారం సాధించుకోవడానికి సమయం అసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో అన్వర్ ఖాన్, శ్రీధర్, బోయ గోపి, సి.పరమేశ్వరి, గుండు అంజయ్య, నేతాజీ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ నాయక్



కాచిగూడ: తెలంగాణలో త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ అధ్యక్షుడు నరసింహ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, నేతలు తమ పదవులకు రాజీనామా చేసి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలన్నారు. కాంగ్రెస్ పార్టీని తండాల పొలిమెరల్లోకి కూడా రానివ్వకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. 'ఇందిరమ్మ రాజ్యాం తెస్తా.. లంబాడీల ఆత్మగౌరవాన్ని పెంచుతా..'అని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ లంబాడీలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. లంబాడీల కంటే జనాభా తక్కువ ఉన్న ఓ వర్గానికి ఐదు మంత్రి పదవులు, 20కి పైగా కార్పొరేషన్ పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. 10శాతం ఉన్న లంబాడీలకు ఒక మంత్రి పదవి కూడా ఇవ్వకపోవడం లంబాడీలను అవమానించడమే అవుతుందన్నారు.

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

- రాష్ట్రంలోని అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నామినేటెడ్ పోస్టులు రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆవేదన
- బీసీలు సంఘటితంగా ఉంటే పదవులు ఇవ్వక తప్పదని వ్యాఖ్య



ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆధ్వర్యంలో కాచిగూడలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న అజీజ్ పాషా, అరవింద్ కుమార్ గౌడ్, కోల జనార్ధన్, గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు పార్టీలోని ప్రధాన పదవుల్లో అవకాశం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ అధ్యక్షతన గురువారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో 'ఓబీసీల సమస్యల పరిష్కారానికి -రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం'అనే అంశంపై అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్‌పాషా, టీడీపీ నేత అరవింద్ కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

నామినేటెడ్ పోస్టులు బీసీలకు ఇవ్వాల్సిందే..

పార్టీలు, సంఘాలకు అతీతంగా బీసీలందరూ ఒకే వేదికపైకి వచ్చి సంఘటితంగా ఉద్యమించినప్పుడే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో బీసీల జనాభాకు అనుగుణంగా అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం ఆ పదవులు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను బీసీలు సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

అగ్రకులాల నేతలే రాజ్యమేలుతున్నారు...

తెలంగాణ ఏర్పడితే సామాజిక న్యాయం వస్తుందని, బీసీ ముఖ్యమంత్రి అవుతారని భావించామన్నారు. కాని కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అగ్రకులాల నేతలే రాజ్యమేలుతున్నారని అన్నారు. రాజకీయ పార్టీ పదవుల్లో, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అగ్రకులాల నేతలే అందిపుచ్చుకుంటూ బీసీలను బానిసలుగా చేసి వాడుకుంటున్నారని వారు విమర్శించారు. తెలంగాణలో ఒకే కుటుంబం రాజకీయంగా అభివృద్ధి చెందిందన్నారు.

రాహుల్ గాంధీ ప్రోద్బలంతోనే కులగణన సాధ్యమైంది...

రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసిందన్నారు.రాహుల్ గాంధీ ప్రోద్బలంతోనే రాష్ట్రంలో కుల గణన సాధ్యమైందని తెలిపారు. బీసీ వర్గానికి చెందిన ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్‌లో తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసు సురేష్, మేకపోతుల నరేందర్ గౌడ్, టి.రాజు, ఓరుగంటి వెంకటేశం, నీల వెంకటేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ పాల్గొన్నారు.